


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL  ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి  శుక్రవారం 17-04-2026  సంపుటి : 07  సంచిక 318  పేజీలు : 8  వెల : రూ 3-00


# ఈ రాజ్యాంగ సవరణ బిల్లు దేశ చరిత్రలోనే గొప్పది: ప్రధాని మోదీ

న్యూ ఢిల్లీ, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు.ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు.'పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు.ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయనివ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే. వారు తమ హక్కుల కోసం 30 ఏళ్లుగా పోరాడుతున్నారు. తమ శక్తి నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ బిల్లు వెనుక ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఈ విషయంలో రాజకీయం చేయొద్దు. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు.'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు.



కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ రేపు(శుక్రవారం) ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు.

# స్వీయ జనగణనలో వివరాలను నమోదు చేసుకున్న సీఎం



## జనగణన ప్రక్రియలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు

అమరావతి, ఏప్రిల్ 16రాష్ట్రంలో ఇవాల్టి నుంచి ప్రారంభమైన స్వీయ జనగణన కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. హౌస్ లిస్టింగ్- హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో భాగంగా ఆన్ లైన్ ద్వారా వివరాల నమోదు ప్రక్రియ ఇవాళ ప్రారంభమైంది. బవ.ఇవనిబబీబ.ణనీల.తిని వెబ్ సైట్ ద్వారా ముఖ్యమంత్రి వివరాలను నమోదు చేశారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ఏపీ జనగణన డైరెక్టర్ జె.నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 30 తేదీ వరకూ ప్రజలు స్వయంగా ఆన్ లైన్ లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని ముఖ్యమంత్రికి తెలిపారు. మే 1 తేదీ నుంచి 30 తేదీ వరకూ ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపడతారని తెలియచేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో పౌరులందరికీ సమానంగా సంక్షేమం అభివృద్ధి ఫలాలు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. దీని కోసం కుటుంబాన్ని యూనిట్ గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికల్ని రూపొందించటం అవసరమని ఈ లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ఏపీలో జనగణన కార్యక్రమం జరుగుతోందని ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాకుండా అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. జనాభా లెక్కల కార్యక్రమం రెండు దశల్లో జరుగనుందని మొదటి దశలో ఇవాల్టి నుంచే ఇండ్ల గణన ప్రారంభమైందన్నారు. వచ్చే ఏడాది నుంచి ప్రారంభమయ్యే రెండో దశలో జనాభా లెక్కల సేకరణ మొదలవుతుందన్నారు. ప్రస్తుతం ప్రారంభమైన ఇండ్ల గణన( హౌస్ లిస్టింగ్- హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో ప్రజలు స్వయంగా ఆన్ లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. సరైన వివరాలను నమోదు చేయటం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సహకారం అందించాలని ప్రజలను కోరారు. మొత్తం ఈ జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

# ఫిష్ ఆంధ్రా అంటూ డబ్బును డైవర్ట్ చేశారు: మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి: వైఎస్ జగన్‌పై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్‌కు తల్లి, చెల్లి, రాష్ట్రం, దేశం పట్ల ఎలాంటి బాధ్యతా భావం, భక్తి లేవని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. తీర ప్రాంత భద్రతను బలోపేతం చేయడానికి రానున్న సాగర్ డిఫెన్స్ ప్రాజెక్టును కూడా తరిమేస్తానని జగన్ మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో శత్రు దేశాల నుంచి వచ్చే ముప్పులను ఎదుర్కొనేందుకు ఈ ప్రాజెక్టు అవసరమని ఆయన పేర్కొన్నారు.తీర ప్రాంతంలో తమిళనాడు మత్స్యకారులు ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి వచ్చి సమస్యలు సృష్టించడం పెద్ద సమస్యగా మారిందని చెప్పారు. జగన్ హయాంలో



మెరైన్ పోలీసుల గస్తీ బలహీనపడిందని పేర్కొన్నారు. 144 గ్రామాలకు సంబంధించిన గ్రామ కాపుల సమావేశాలను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.విశాఖపట్నం, కాకినాడ, జువ్వలదిన్నెలలో ఫిషింగ్ హార్బర్లు ఇప్పటికే పనిచేస్తున్నాయని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జెట్టీలు నిర్మించామని తెలిపారు. వైఎస్ఆర్ నుంచి జగన్ వరకూ మత్స్యకారులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. సోంపేట ఘటనలో మత్స్యకారులపై కాల్పులు జరిగిన విషయాన్ని గుర్తుచేశారు.వేట నిషేధకాలంలో మత్స్యకారులకు ఇచ్చే పరిహారాన్ని రూ.4 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచినట్టు తెలిపారు. మత్స్యకార సంక్షేమం కోసం కేంద్రం ఇచ్చిన నిధులను గత ప్రభుత్వం సరిగా వినియోగించలేదని, ఫిష్ ఆంధ్రా పేరుతో నిధులు మళ్లించారని ఆరోపించారు. ప్రధాని మత్స్య సంపద యోజన కింద మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.






# కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

## నష్టపరిహారం ప్రకటించిన ప్రధాని



న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: కర్నూలు జిల్లాలోని మంత్రాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలతోపాటు క్షతగాత్రులకు ఆయన నష్ట పరిహారాన్ని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేలు చొప్పున నష్టపరిహారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఈ నష్ట పరిహారాన్ని అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రధాని మోదీ స్పందించారు.మంత్రాలయంలో కొలువుదీరిన శ్రీరాఘవేంద్ర స్వామి వారిని దర్శించుకునేందుకు కర్ణాటక వాసులు బొలెరో వాహనంలో వెళ్తున్నారు. ఈ వాహనం ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మరణించారు. 13 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మరణించగా.. మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలికలు ఉన్నారు. వీరంతా కర్ణాటకలోని చిక్‌మంగళూరు వాసులని జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు.కర్నూలు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులను జిల్లా కలెక్టర్ సిరి పరామర్శించారు. ఈ ప్రమాదంలో గాయపడి.. ఎమ్మిగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందిన నలుగురు క్షతగాత్రులు డిశార్చ్ అయ్యారన్నారు. మిగిలిన వారు.. కర్నూలు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందన్నారు.మంత్రాలయం మండలం చిలకలడోన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. బొలెరో వాహనం డ్రైవరు నిద్ర మత్తులో ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీకొనడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన వివరించారు.మంత్రాలయం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో 8 మంది మృతి చెందారని తెలిసి తీవ్రగ్భ్రాంతికి లోనయ్యానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. మంత్రాలయం క్షేత్రం దర్శనం కోసం వస్తున్న కర్ణాటకకు చెందిన భక్తులు ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారని అధికారులు వివరించారని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. కర్ణాటకలోని ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని బాధిత కుటుంబాలకు తగిన సహాయం చేయాలని కూడా సూచించామన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.ఈ దుర్ఘటనలో కర్ణాటకకు చెందిన 8 మంది మృతి చెందడం అత్యంత విషాదకరమని ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. బొలెరో వాహనం రెడీమిక్స్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.మంత్రాలయం జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి మున్ముందు ఈ తరహా ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని కర్నూలు ఎమ్మెల్యే, మంత్రి టీజీ భరత్ గుప్తా ప్రకటించారు. కర్నూలు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులను ఆయన పరామర్శించారు. చికిత్స పొందుతున్న వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించినట్లు మంత్రి భరత్ గుప్తా తెలిపారు.

# సంపాదకీయం

శుక్రవారం 17-04-2026

## ట్రంప్ ఇంట రచ్చ మొదలు

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచీ ఆయన పట్టిందల్లా వివాదమే అవుతున్నది. ఇంటాబయటా ఆయన నిర్ణయాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. 'అమెరికా గ్రేట్ ఎగైన్' అంటూ అగ్రరాజ్యం పగ్గాలు అందుకున్న ట్రంప్ 'అమెరికాను గ్రేట్ చేయకపోయినా ఫర్వాలేదు, ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలుకుబడి తగ్గించకపోతే చాలు!' అనే పరిస్థితి ఏర్పడింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాలు ఇన్నాళు శత్రువులకు మాత్రమే నచ్చలేదు. కానీ ఇప్పుడు సొంత దేశంలోని వారికి కూడా ఇష్టం లేదని తెలుస్తోంది. ఆసియా దేశాలకు చమురు సరఫరా కోసం కీలకంగా ఉన్న హర్మోజ్ జల సంధిని దిగ్బంధం చేస్తున్నట్లు ఇటీవల ట్రంపు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ నిర్ణయం పై కొన్ని మిత్ర దేశాలతో సహా అమెరికా సైన్యం కూడా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. అసలు సైన్యం ఎందుకు వ్యతిరేకిస్తుంది? ట్రంప్ హర్మోజ్ దిగ్బంధంపై మిత్ర దేశాలు ఏమంటున్నాయి? ఇరాన్–ఇజ్రాయిల్ మధ్య రగిలిన చిచ్చుతో అమెరికా ఎంట్రీ ఇచ్చి యుద్ధ వాతావరణన్ని నెలకొల్పింది. ఇప్పటికే ఇరాన్ పై ఎన్నో రకాల దాడులు చేసిన అమెరికా ఆ తర్వాత ఆ దేశ సుప్రీం లీడర్ ను అంతం చేసిన విషయం తెలిసిందే. అయితే యురేనియం పై ఆధిపత్యం తమది ఉండాలన్న అమెరికా కు ఇరాన్ వ్యతిరేకంగా నిలుస్తూ గట్టి పోరాటాన్ని చేస్తోంది. కొన్ని రోజులుగా సాగిన యుద్ధం తర్వాత ఏప్రిల్ 11న పాకిస్థాన్లోని ఇస్లామాబాదులో ఇరాన్, అమెరికా నేతల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. అయితే ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఆసియా దేశాలకు కీలక రవాణా మార్గం అయిన హర్మోజ్ జల సంధిని తమ ఆధీనంలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమ వలసదారులపై ట్రంప్ ఉక్కుపాదం మోపారు. ఆ తర్వాత ప్రపంచ దేశాలతో వాణిజ్య యుద్ధానికి దిగారు. మిత్రులు, శత్రువులన్న తేడా లేకుండా అందరిపై భారీగా టారిఫ్‌లు విధించారు. వీటిని అమెరికా ఫెడరల్ కోర్టు కొట్టేయడంతో అమెరికా అధ్యక్షుడికి సొంత దేశంలో చుక్కెదురైంది. ఆ తర్వాత డ్రగ్ మాఫియాను నడుపుతున్నారన్న ఆరోపణలపై ఏకంగా వెనెజువెలా దేశాధినేతను రాత్రికిరాత్రి అరెస్టు చేశారు. అనంతరం పశ్చిమాసియాలో పోరుకు ఆజ్యం పోశారుఇరాన్‌ను రెండు వారాల్లోపు అదుపులోకి తీసుకుంటానని భావించిన ట్రంప్ ఎంతకీ పైచెయ్యి సాధించకపోవడం, రోజూ వేల కోట్ల రూపాయల నష్టం వస్తుండటంతో ఐదు రోజుల విరామాన్ని ప్రకటించారు. ఆ తర్వాత విజయం తమదేనని స్వయంగా ప్రకటించుకొని శాంతి చర్చలకు మొగ్గుచూపారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై యుద్ధం చేయాలన్న ట్రంప్ నిర్ణయంపై సొంత దేశంలోనే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైకి వేరే కారణాలు చెప్తున్నప్పటికీ యుద్ధం వద్దని వారించినందుకే అటార్నీ జనరల్ పామ్ బొండిని, అంతకుముందు హోంల్యాండ్ సెక్యూరిటీ చీఫ్ క్రిస్టీ నోయిమ్‌ను పదవి నుంచి తప్పించారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. అంతేకాదు, ఇరాన్ యుద్ధాన్ని మొదటినుంచి వ్యతిరేకిస్తున్న ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చివరికి శాంతి చర్చలకు నాయకత్వం వహించాల్సి వచ్చిందని చెబుతున్నారు. ఎడతెగని యుద్ధం వల్ల అమెరికాకు భారీగా నష్టం వాటిల్లుతున్నదని అమెరికన్లు విమర్శిస్తున్నారు. 'నో కింగ్స్' నిరసనలు వెల్లువెత్తిన విషయం విదితమే. 54 శాతం మంది అమెరికన్లు ఈ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ఇటీవల ఇప్సాస్ రాయిటర్స్ సర్వేలో వెల్లడవడం అందుకు నిదర్శనం. 24 శాతం ట్రంప్ చర్యను సమర్థించగా, 22 శాతం దీనిపై స్పందించడానికీ విముఖత చూపారట. అధికార రిపబ్లికన్ పార్టీలోనూ 46 శాతం మంది ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని తేలడం గమనార్హం.రాన్ ఈ జలసంధి పై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. కొన్ని దేశాలకు చెందిన నౌకలను వెళ్లకుండా ఆపుతోంది. ఆయా దేశాలు టోల్ ఫీజు కడితేనే విడిచిపెడుతోంది. అయితే భారత్ తో సహా కొన్ని మిత్ర దేశాలకు ఇరాన్ ఎలాంటి ఫీజు లేకుండా నౌకలను విడిచిపెడుతోంది. ఈ సమయంలో ట్రంప్ ఎలాంటి నౌకలు వెళ్లకుండా చేస్తామని.. పూర్తిగా దిగ్బంధం చేసినట్లు చెప్పాడు. అయితే ఈ నిర్ణయం పై సొంత దేశ సైనిక అధికారులు వ్యతిరేకత తెలుపుతున్నట్టు తెలుస్తోంది. ఎందుకంటే ఒక సమస్య తొలగి పోవాలంటే పరిష్కారం గురించి ఆలోచించాలి. కానీ ట్రంప్ కొత్త సమస్యను సృష్టించడంతో ప్రపంచం అల్లకల్లోలంగా మారబోతుంది. ఇప్పటికే ఇరాన్ ను అమెరికా ఎన్నో రకాలుగా దాడులు చేసి ముప్పు తిప్పలు పెడుతున్నా.. ఎలాంటి భయాందోళన చెందడం లేదు. కానీ ఇప్పుడు ట్రంపు తీసుకునే నిర్ణయంతో మిత్రదేశాలు కూడా వ్యతిరేకంగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది.కొన్ని వర్గాల వారి వస్తున్న సమాచారం మేరకు గల్ఫ్ దేశాలైన కువైట్ వంటివి అమెరికాకు మిత్ర దేశంగా ఉన్నా కూడా.. ట్రంప్ తీసుకునే నిర్ణయాలపై వ్యతిరేకంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో నేరుగా ఇరాన్తో చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. ఇలా అమెరికాకు మిత్ర దేశాలుగా ఉన్నవి.. నేరుగా ఇరాన్తో చర్చలు జరిపి సఫలం అయితే అప్పుడు అమెరికా ఒంటరిగా మారే అవకాశం ఉంది. మరోవైపు అమెరికాలోని డాలర్ వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం కూడా ఉందని తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా హర్మోజ్ జలసంధిని తాము దిగ్బంధం చేశామని చెబుతున్నా కూడా.. అమెరికన్ సైనిక బలగాలు ఇప్పటివరకు ఈ జల సంధి కి చేరుకోలేదన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇరాన్తో రెండో విడత చర్చలు ఉన్నట్లు ట్రంపు ప్రకటించడంతో.. అమెరికన్ సైనికులకు అయోమయంగా మారినట్లు తెలుస్తోంది. సొంత ప్రజలే వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఇకపై అయినా ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటారేమో వేచిచూడాలి.

# 'సమస్యలు పరిష్కారం అయ్యే వరకు బ్లాస్టింగ్‌కు నో ఎన్‌ఓసీ'



రుద్రంపూర్, ఏప్రిల్ 16 : ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అయ్యే వరకు బ్లాస్టింగ్‌కు అవసరమైన అభ్యంతరం లేని ధృవపత్రం (ఔఅ) ఇవ్వబోమని చుంచుపల్లి మండలం ధన్బాద్ పంచాయతీ సర్పంచ్ గుగులోతు జ్యోతి స్పష్టం చేశారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. సింగరేణి గనుల కార్యకలాపాల వల్ల గ్రామంలో దుమ్ము తీవ్రంగా వ్యాపిస్తూ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మౌలిక వసతులు కూడా యాజమాన్యం కల్పించడం లేదని విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రుద్రంపూర్ ప్రాంతంలో సింగరేణి ఆధ్వర్యంలో కొత్త అఊఖ సైడింగ్, రహదారి, ఎంబాంక్మెంట్ పనులు ఎఐఅఓ ప్రాజెక్ట్ విస్తరణలో భాగంగా కొనసాగుతున్నాయి. భూమి తవ్వకాల సమయంలో గట్టి రాళ్లు ఎదురవడంతో బ్లాస్టింగ్ అవసరం ఏర్పడింది. దీనికి అనుమతుల కోసం సింగరేణి అధికారులు జిల్లా పరిపాలనను సంప్రదించగా, అధికారులు స్థల పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.గ్రామ సభలో గ్రామస్తులు పలు సమస్యలను ప్రస్తావించారు. తాగునీటి కోసం కనీసం రెండు కుళాయిలు కూడా ఏర్పాటు చేయలేదని, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్

### ధన్బాద్ పంచాయతీ కఠిన నిర్ణయం

ఇతర పంచాయతీలకు ఇచ్చి తమను విస్మరించారని ఆరోపించారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని, ప్రభావితం కాని ప్రాంతాల వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. బ్లాస్టింగ్ కారణంగా గాలి కాలుష్యం పెరిగి దుమ్ము తీవ్రంగా వ్యాపిస్తోందని, పేలుళ్ల వల్ల ఇళ్లలో చీలికలు వస్తున్నాయని, కంపనాల వల్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో రాళ్లు 500 మీటర్ల నుంచి 1 కిలోమీటర్ దూరం వరకు ఎగిరి పడుతున్నాయని, ఇది ప్రాణాపాయానికి దారితీసే ప్రమాదమని హెచ్చరించారు. భూగర్భ జలాలపై కూడా ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, ఆఉఓూ నిబంధనలు సక్రమంగా పాటిస్తున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని, బఫర్ జోన్ నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ బెల్ట్ అభివృద్ధి, గాలి కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.గతంలో పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో స్థానిక యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పని చేయించుకున్నారు కాగితాలను పక్కకు పెట్టారు, ఇదేనా మాట మీద నిలబడే మీ తత్వం, ఇదేనా ప్రభావిత ప్రాంత ప్రజల పైన మీకు ఉన్న శ్రద్ధ, ఆఖీ కింద స్థానిక యువతకు ఉద్యోగాలు, విద్యా, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించాలని కోరారు. అంతేకాకుండా వీ కే కోల్ మైన్ విస్తరణలో భాగంగా మాయాబజార్ ప్రాంతంలో నిర్వాసితులైన 15 మందికి ఇంటి స్థలాలు కేటాయించాలని, ఇంటి స్థలాలు కేటాయించిన స్థలాలలో మంచినీటి వసతులు కల్పించాలని, మా ప్రాంతంలోనే పనులు జరుగుతున్నాయి తమ పిల్లలు ఆడుకోవడానికి నాలుగు లారీల మట్టి అడిగితే ఇవ్వలేదని. ఇదే రైల్వే సైడింగ్ తీసుకున్న మట్టి పాల్వంచ వరకు ఎట్లా వెళ్లింది అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఔఅ ఇవ్వబోమని సర్పంచ్, పాలక మండలి సభ్యులు, గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వికే కోల్ మైన్స్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం. నరసింహారావు మాట్లాడుతూ.. గ్రామస్తులు లేవనెత్తిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ సభలో ఉప సర్పంచ్ ప్రేమ్ సెక్రెటరీ ఉపేందర్, రుద్రంపూర్ కార్యదర్శి నరేందర్, వార్డు మెంబర్లు లత, కర్రి అపర్ణ, ఒరుసు నర్సి, ఏరియా సివిల్ ఏజీఎం రామకృష్ణ, స్టేట్ అధికారి తౌర్య, సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్, ఈఈ సుమంత్, శ్రీనివాస్, జమేదార్ కామరాజు, మాజీ సర్పంచ్ బానోత్ రాందాస్, మాజీ ఎంపీపీ సలిగంటి శ్రీనివాస్, భూక్యా శ్రీదేవి, పెచ్చెట్టి శివ,పూల రవీందర్, కీర్తి రవీందర్, ఇస్లవత్ రంజిత్, కర్రి శేఖర్, జక్కెనవేణి నరేష్, అనిల్, పిల్లి సుజాత నాగరాజు, డేవిడ్, కార్తీక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఒక మంత్రికి 10 పర్సెంట్ అనే పేరుంది.. నీ ప్రభుత్వం కూలేందుకు రెడీగా ఉంది : మోత్కుపల్లి నర్సింహులు సంచలన వ్యాఖ్యలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేం అలసిపోయాం. మీరు పెట్టే అవమానం.. ఈ వ్యవస్థలో మాకు జరిగే అన్యాయాన్ని, అవమానాన్ని చక్కదిద్దే స్థితిలో మీరు లేరు. కారణమేంటో మీరే చెప్పాలి. దీని క్కారణమేంటి.. నీ వెనుక గుంతలు తవ్వుతున్నరు.. నల్లికుట్లోళ్లు ఎవరు ..? చెప్పమంటవా..? నీ గవర్నమెంట్ కూలిపోవడానికి చాలా సిద్ధంగా ఉంది. నువ్వు ఒక్కడివే పనిచేస్తే కుదరదు కదా.. వర్గీకరణ అయిన తర్వాత కూడా ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సమావేశాలు పెడితే నువ్వేమైనా చేయగలిగావా?? అని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.అసలు అవినీతి పరులను ఒక్కన్నన్నా నువ్వు తీసేసినవా..? ఒక్కడి మీదనన్నా నువ్వు యాక్షన్ తీసుకున్నవా.. అసలు ఎవరు అవినీతి పరులు.. ఈ గుంతలు తవ్వేటోడు ఎవరు..? అవినీతిలో 10 శాతం అని పేరు పడ్డ మంత్రి ఎవరు..? అసలు నీ పార్టీ ఎట్లొస్తది. ఇంత బహిరంగ అవినీతి రాష్ట్రంలో ఏ మూలకెళ్లి ఎవరిని అడిగినా.. ఒక మంత్రికి 10 పర్సెంట్ అనే పేరుంది ఆయనకు.. 10 పర్సెంట్ అంటే ఆయన పేరు చెబుతురు జనం. మరి ఎందుకు నిర్ణయం తీసుకోలేకపోతున్నవ్ నువ్వు.ఒక వ్యక్తి ఎస్సీ, బీసీ, ఓసీ ఎవరైతే ఏంది.. అవినీతి పరుడు ఎవరైనా తీసేయాల్సిందే. ఎందుకు తీసేయ్యలేకపోతున్నవ్.. నీకు ముఖ్యమంత్రి పదవే ముఖ్యమా..? నీ పదవి ఉండాలన్నా.. ప్రజలు నీవెంబడి ఉండాలే కదా.. ప్రజలు నీ వెంబడి ఉండాలంటే అవినీతి పరులకు అంతం పలకాలి కదా.. ఈ గొయ్యి తవ్వుతున్నది ఎవరు..? ఇంత అవినీతి పరుడు ఉన్న ప్రభుత్వంఎట్లా నడుస్తదని ధ్వజమెత్తారు. ఈ వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.




## టెహ్రాన్‌లో అసిమ్ మునీర్.. అణ్వస్త్ర అంశాలపై ఇంకా ప్రతిష్టంభన

వాషింగ్టన్: పాకిస్థాన్ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ ప్రస్తుతం ఇరాన్)లో పర్యటిస్తున్నారు. టెహ్రాన్‌లో ఆయన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగాచితో భేటీ అయ్యారు. అయితే అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తలను తగ్గించే నేపథ్యంలో అసిమ్ మునీర్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే యుద్ధం విషయంలో ఇరాన్, అమెరికా మధ్య కొన్ని అంశాల్లో అగ్రిమెంట్ కుదిరింది. రెండు వారాల సీజ్‌ఫైర్ నేపథ్యంలో ఇంకా కొన్ని తేలని అంశాలు ఉన్నాయి. ఇరాన్ చేపట్టే అణ్వస్త్ర కార్యక్రమాల గురించి రెండు దేశాల మధ్య ఒడంబడిక కుదరలేదని ఓ సీనియర్ ఇరానీ అధికారి తెలిపారు. అసిమ్ మునీర్ రాక వల్ల అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభన కొంత తగ్గినట్లు ఓ అధికారి చెప్పారు.కొన్ని అంశాల్లో అంగీకారం కుదిరిందని, అయితే టెహ్రాన్, వాషింగ్టన్ మధ్య చర్చల వల్ల సీజ్‌ఫైర్‌ను మరింత పొడిగిస్తారన్న భావన వస్తోందని ఆ అధికారి తెలిపారు. కేవలం అణ్వస్త్ర రంగం అంశంలో మాత్రం అమెరికా,ఇరాన్ మధ్య బేధాభిప్రాయాలు వస్తున్నట్లు వెల్లడించారు. శుద్దీకరించిన యురేనియంతో పాటు న్యూక్లియర్ ఆంక్షల అంశంలో ఇంకా అంగీకారం కుదరలేదని తెలుస్తున్నట్లు ఆ అధికారి చెప్పారు. అమెరికా, ఇరాన్ మధ్య జరిగే రెండో దఫా చర్చలపై ఇంకా తేదీలను నిర్ణయించలేదని పాకిస్థాన్ విదేశాంగ ప్రతినిధి తెలిపారు. ప్రస్తుతం ఆ దేశాలు న్యూక్లియర్ అంశాలపై చర్చిస్తున్నాయన్నారు.



## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఐ, రైతు సంఘం రాస్తారోకో

మునుగోడు, ఏప్రిల్ 16 : నెల రోజులుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి కాంటాల కోసం ఎదురు చూస్తున్న రైతులను తాలు, తేమ పేరుతో అధికారులు ఇబ్బందులకు గురి చేయడం సరికాదని డిమాండ్ చేశారు. గురువారం మునుగోడు మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురజా రామచంద్రం మాట్లాడుతూ.. నెలల తరబడి ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందికి గురి చేస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎలాంటి కొర్రెలు పెట్టకుండా ప్రభుత్వ మద్దతు ధర కొనుగోలు చేయాలన్నారు.ఆరుగాలం శ్రమించి మార్కెట్‌కు తీసుకొస్తే పలు ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. మిల్లర్లు అధికారులు కుమ్మక్కై రైతుల ధాన్యాన్ని హాజరైన తాలు, తేమ పేరుతో కొనుగోలుకు నిరాకరించడం సరికాదన్నారు. ధాన్యం కొనుగోలును వెంటనే ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని ఈ సందర్భంగా తెలిపారు. రాస్తారోకో సందర్భంగా స్థానిక పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు విషయం తెలుసుకున్న స్థానిక తాసీల్దార్ రైతులకు న్యాయం చేస్తామని, కొనుగోలు వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. సిపిఐ రైతు సంఘం నాయకులు బిస్మించి కూర్చొవడంతో పోలీసులు వారిని బలవంతంగా తరలించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొలుగూరి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చాపల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య, మండల కార్యవర్గ సభ్యులు బండమీది యాదయ్య, మందుల పాండు, ఈదులకంటి కైలాస్, కాగితం వెంకన్న, దుబ్బ వెంకన్న, కురుమర్తి ముత్తయ్య, తీర్పార కృష్ణయ్య, కట్కూరి లింగస్వామి, చిరగోని శంకర్, నరసింహ పాల్గొన్నారు.

## ముస్తఫాకు అంబేద్కర్ జాతీయ అవార్డు



రుద్రంపూర్, ఏప్రిల్ 16 : అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ అభ్యుదయ రత్న?2026 అవార్డును రామవరం పరిరక్షణ సమితి అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా అందుకున్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్ చిక్కడపల్లిలో గల త్యాగరాయ గానసభలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖుల సమక్షంలో ముస్తఫాకు అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంస్థ ఫౌండర్, నేషనల్ చైర్మన్ డా. కె. చక్రవర్తి, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, న్యూమరాలజిస్ట్ దివంగ శర్మ, రిటైర్డ్ జడ్జి బూర్గుల మధుసూదన్, రిటైర్డ్ ఐఏఎస్ బి.లక్ష్మీకాంతం, రిటైర్డ్ ఎస్పీ ఎస్.ఎం. రత్న, అష్టావధాని సురభి శంకర శర్మ, రిటైర్డ్ డీఎస్పీ డాక్టర్ జి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.రామవరం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి కోసం కృషి చేయడంతో పాటు, కరపత్రాలు, కవితల ద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యం కల్పిస్తున్నందుకు గాను ముస్తఫా ఈ అవార్డుకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా ముస్తఫాను ప్రకృతి, పర్యావరణ ప్రేమికులు మొక్కల వెంకటయ్య, మొక్కల రాజశేఖర్, సుగుణారావు, తూముల శ్రీనివాస్, సావేటి స్వామి, నజీర్, తులసి రామ్, యశ్వంత్, కొయ్యడ వెంకటేశ్వర్లు, రాజారాం, దశరథ్ రజ్వ తదితరులు అభినందించారు.

## బాధితులకు భరోసా కేంద్రాలు కొండంత అండ

### కేంద్ర పనితీరును అడిగి తెలుసుకున్న అడిషనల్ డీజీపీ చారు సిన్హా

కరీంనగర్ ,కరీంనగర్ భరోసా కేంద్రం తనిఖీలైంగిక వేధింపులకు గురైన మహిళలు, చిన్నారులకు సురక్షితమైన వాతావరణంలో చేయూతను అందించి, వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు 'భరోసా' కేంద్రాలు కొండంత అండగా నిలుస్తున్నాయని రాష్ట్ర అడిషనల్ డీజీపీ సీఐడీ మరియు ఏసీబీ చారు సిన్హా పేర్కొన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా కొత్తపల్లిలో ఉన్న 'భరోసా' కేంద్రాన్ని ఆమె సందర్శించి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలను తనిఖీ చేశారు.?రికార్డుల పరిశీలన సిబ్బందికి సూచనలు:?కేంద్రంలోని ప్రతి విభాగాన్ని సందర్శించిన అడిషనల్ డీజీపీ, సిబ్బందితో మాట్లాడి పనితీరును సమీక్షించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బాధితులకు తక్షణ న్యాయ సహాయం, కౌన్సిలింగ్ అందించడంలో ఏమాత్రం జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు.?శిక్షల శాతం పెరగాలి:?ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.తెలంగాణ పోలీసు శాఖలోని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు మంచి సత్ఫలితాలను ఇస్తున్నాయి. లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా పక్కాగా ఆధారాలను సేకరించాలి. బాధితులకు ప్రభుత్వం నుండి అందాల్సిన నష్టపరిహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి అని అధికారులను ఆదేశించారు. 2024 డిసెంబర్లో ప్రారంభమైన ఈ కేంద్రం, బాధితులకు పోలీస్ స్టేషన్లు మరియు ఆసుపత్రులకు తిరిగే ఇబ్బంది లేకుండా ఒకే చోట అన్ని సేవలు అందించడం అభినందనీయమ న్నారు.తనిఖీ అనంతరం భరోసా కేంద్రం ఆవరణలో మొక్కను నాటారు. ఈ తనిఖీ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకటస్వామి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ పుల్లయ్య, ఎస్సై అనూష, భరోసా కేంద్రం సిబ్బంది మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# తండ్రి చాటు నుంచి.. తండ్రిని దాటేసే స్థాయికి..నారా లోకేష్...

## ఒక్కో మెట్టు ఎక్కుతూ.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దాకా...



విజయవాడ, ఏప్రిల్ 16, చంద్రబాబు కుమారుడు నారా లోకేష్‌కి వారసత్వమే మొదటి సవాల్ అంటే ఆశ్చర్యం కలగొచ్చు. కానీ చంద్రబాబు కుమారుడు టీడీపీ భవిష్యత్ నేతగా ఎదగాలంటే లోకేష్ ప్రతీ అడుగులో విమర్శలు, పోలికల పరీక్షలు నెగ్గాల్సొచ్చింది. రాజకీయ ఆసక్తి ఉన్న యువకుడిగా ఆయన అర్హతలు వాటిముందు తూగలేక పోయాయి. కార్యకర్తల సంక్షేమం మొదటి భాద్యతగా పార్టీలో అడుగుపెట్టి ఒక్కో మెట్టు ఎక్కుతూ ఇప్పుడు పార్టీకి భవిష్యత్ నేతగా ఎదగటం ఆషామాషీ కాదు. 2013లో రాజకీయాల్లోకి అడుగుపెట్టినప్పుడు ఆయనపై 'వారసుడు' అనే ముద్ర బలంగా పడింది. ప్రతిపక్షాల నుంచి ఎదురైన వ్యక్తిగత విమర్శలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఆయన్ని మానసికంగా దెబ్బతీయాలని చూశాయి. ముఖ్యంగా ఆయన ప్రసంగ శైలి, తెలుగు ఉచ్ఛారణ మొదలు ను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు చేసిన విమర్శలు అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. కానీ, ఒకరకంగా ఆ విమర్శలే ఆయనను రాటుదేల్చాయి. లోకేష్ తన లోపాలను సరిదిద్దుకుంటూ, మౌనంగా తన పని తాను చేసుకుంటూ పోయారు.చంద్రబాబు నాయుడు పాలనపై దృష్టి పెట్టిన సమయంలో, పార్టీ క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని సమన్వయం చేసే బాధ్యతను లోకేష్ భుజాన వేసుకున్నారు. 'కార్యకర్తల సంక్షేమ నిధి' ద్వారా వేలాది మంది కార్యకర్తలకు అండగా నిలిచారు. ఇది ఆయనకు పార్టీ కేడర్‌లో బలమైన గుర్తింపును తెచ్చిపెట్టింది. నాయకత్వం అంటే కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు, క్లిష్ట సమయాల్లో కార్యకర్త వెనుక నిలబడటమేనని ఆయన నిరూపించారు.2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసి ఓడిపోవడం లోకేష్ రాజకీయ జీవితంలో ఒక పెద్ద కుదుపు. కానీ, ఆ ఓటమి ఆయన్ని నిరుత్సాహపరచలేదు. ఆవిర్భావం నుంచీ పార్టీ ఒక్కసారి కూడా గెలుచుకోని స్థానాన్ని ఎంచుకోవడమే పెద్ద సవాలు. అన్నీ వడ్డించిన విస్తరిలో భుజించడం ఆయనకు తేలికే.. కానీ తన ప్రయత్నమే కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలవాలనే యత్నమే ఆయన పట్టుదలకు నిదర్శనం. అందుకే గెలిచిన ప్రత్యర్థి కంటే ఎక్కువగా నియోజకవర్గంలో గడిపారు. ఓడినా అక్కడే ఉండి ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం ఆయన పట్టుదలకు నిదర్శనం. ఈ పట్టుదలే 2024లో అదే మంగళగిరి నుంచి రికార్డు మెజారిటీతో విజయం సాధించారు.నందమూరి, నారా వారసుడిగా లోకేష్ కు గుర్తింపు ఉన్నా.. యువ గళం పాదయాత్ర ఆయన్ను నాయకుడిగా మార్చింది. 4,000 కిలోమీటర్లకుపైగా సాగిన ఈ సుదీర్ఘ యాత్రలో అన్ని వర్గాల వారితో మమేకమయ్యారు, కార్యకర్తల మనోభావాలు తెలుసుకున్నారు. మండుటెండల్లో సైతం సాగిన ఈ యాత్రలో ఆయన తన మాట తీరును, బాడీ లాంగ్వేజ్‌ను పూర్తిగా మెరుగు పరచుకున్నారు. సమస్యలను అర్థం చేసుకోవడంలో లోకేష్ చూపిన చొరవ, ప్రత్యర్థుల విమర్శలకు ఆయన ఇచ్చిన కౌంటర్లు పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఈ పాదయాత్ర ద్వారా లోకేష్ తనను తాను ఒక మాస్ లీడర్‌గా ఆవిష్కరించుకున్నారు.చంద్రబాబు నాయుడు అనుభవం ఒక ఎత్తయితే, లోకేష్ ఆధునికత మరో ఎత్తు. లోకేష్ తనకంటూ ఒక ప్రత్యేకమైన టీమ్‌ను నిర్మించుకున్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, నిమ్మకాయల విజయ్ లాంటి కొత్తతరం నాయకులను ప్రోత్సహిస్తూ పార్టీలో యువ రక్తాన్ని ఎక్కిస్తున్నారు. ఐటీ నిపుణులు, యువ మేధావులు, రాజకీయ విశ్లేషకులతో కూడిన ఈ బృందం పార్టీ ప్రచార శైలిని మార్చేసింది. డిజిటల్ మీడియాను ఉపయోగించుకోవడంలో, డేటా విశ్లేషణ ద్వారా నియోజకవర్గాల పరిస్థితులను అంచనా వేయడంలో టెక్నాలజీని అందిపుచ్చుకున్నారు లోకేష్. జెన్ – జెడ్ తరానికి తగినట్టు సోషల్ మీడియా వ్యూహాలు రచించే టీం ను ఏర్పాటు చేసుకున్నారు. ఎన్టీయార్, చంద్రబాబు తరం నాయకుల వారసులను చేరదీస్తూ భవిష్యత్ నాయకులతో పార్టీని సిద్ధం చేస్తున్నారు.గతంలో ఐటీ, పంచాయతీరాజ్ మంత్రిగా పనిచేసిన కాలంలోనే లోకేష్ తన పాలనలోనూ సమర్థత చాటుకున్నారు. గ్రామాల్లో ఎల్‌ఈడీ వీధి దీపాలు, సీసీ రోడ్ల నిర్మాణాలతో రికార్డు స్థాయి పనులుచేసారు. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పై ఆయన దృష్టి సారించారు. రోజువారీ ప్రభుత్వ సేవల్లో సరళత తీసుకురావడం ద్వారా పనిచేసే ప్రభుత్వం అని నమ్మకం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. వాట్సాప్ సేవలు తీసుకురావడంలో జాతీయ స్థాయిలో ఏపీ ఆదర్శంగా నిలిచింది. దాంతోపాటు పెట్టుబడులు భారీగా ఆకర్షించాలనే తపన చూపుతున్నారు. మర్రిచెట్టు నీడలో మరో చెట్టు ఎదగడం కష్టం. లోకేష్ తాత ఎన్టీఆర్ లాంటి ఆకర్షణ, చంద్రబాబు క్రమశిక్షణ,చాతుర్యం ముందు దిగదుడుపే. కానీ వారిని అందుకోవాలన్న ఆత్రంకన్నా తనదైన శైలిని ఏర్పరచుకోవాలనే పట్టుదల లోకేష్ లో కనిపిస్తుంది. చంద్రబాబు నాయుడు తర్వాత టీడీపీ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్నకు లోకేష్ తన పనితీరే సమాధానం అంటున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టడం కేవలం పదవి దక్కించుకోవడం కాదు లక్షలాది కార్యకర్తల ఆకాంక్షలను మోసే బాధ్యత.

# ఏడాదిలో 14 కోట్ల లడ్డూల విక్రయం

తిరుమల ఏప్రిల్ 16, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల అమ్మకాలు రికార్డు స్థాయిలో పెరిగాయి. 2025-2026కు సంబంధించి 13,95,43,231 లడ్డూలను విక్రయించారు. 2025-2026 (ఏడాదిలో)లో అదనంగా 1.76 కోట్ల లడ్డూ ప్రసాదాలను విక్రయించారు. ఈ లడ్డూ విక్రయాల ద్వారా రూ.567 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది టీటీడీ ప్రస్తుతం రోజుకు 4 లక్షల వరకు లడ్డూలు తయారు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ వివరాలు ఇలా ఉన్నాయితిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు ప్రతి రోజూ వేలాదిమంది భక్తులు దర్శించుకుంటారు. స్వామివారి దర్శనం తర్వాత లడ్డూ ప్రసాదాలను తీసుకుంటారు. గత ఏడాది కాలంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల విక్రయాలు భారీగా పెరిగాయి. 2025-2026 వార్షిక ఏడాదిలో రికార్డు స్థాయిలో లడ్డూ ప్రసాదాలు విక్రయించారు. 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు మొత్తం 13,95,43,231 లడ్డూలను భక్తులకు విక్రయించారు. 2024-2025 విషయానికి వస్తే 12,18,53,535 లడ్డూలను అమ్మారు. 2024-2025తో పోలిస్తే.. 2025-2026 (ఏడాదిలో) అదనంగా 1.76 కోట్ల లడ్డూలను విక్రయించారు. ప్రస్తుతం టీటీడీ రోజుకు 4 లక్షల లడ్డూలను తయారు చేస్తోంది.. శ్రీవారిని దర్శించుకునే ప్రతి ఒక్క భక్తుడికి ఒక లడ్డూను ఉచితంగా ఇవ్వడంతో పాటు అదనంగా కావాలనుకునే వారికి రూ. 50కి ఒకటి చొప్పున లడ్డూ అందిస్తోంది. 2025-2026 వార్షిక ఏడాదిలో లడ్డూల విక్రయాల ద్వారా రూ. 567 కోట్లు వచ్చినట్లు తెలుస్తోంది.తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వార్షిక వసంతోత్సవాలు ఏప్రిల్ 30 నుంచి మే 02వ తేదీ వరకు భక్తి, వైభవాలతో ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ముందు ఏప్రిల్ 29న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ కార్యక్రమం జరగనుంది. భక్తులు ఒక్కొక్కరు రూ.150/- చెల్లించి వసంతోత్సవ సేవలో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందవచ్చు. ఉత్సవాల్లో భాగంగా మే 1వ తేదీ ఉదయం 9.30 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. మూడు రోజుల పాటు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించబడుతుంది. రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరించి భక్తులకు దర్శనమిస్తూ కటాక్షిస్తారు.వసంతోత్సవాలను పురస్కరించుకుని ఏప్రిల్ 28వ తేదీన ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం విశేషంగా నిర్వహించనున్నారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి, ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమం చేపడతారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి మొదలైనవన్నీ పవిత్రజలంతో శుద్ధి చేయబడతాయి. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం ఉదయం 9 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతి ఇస్తారు. ఈ ఉత్సవాల నిర్వహణ కారణంగా ఏప్రిల్ 28 మరియు ఏప్రిల్ 30 నుంచి మే 02వ తేదీ వరకు కళ్యాణోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ పద్మావతి అమ్మవారి కటాక్షాన్ని పొందాలని టీటీడీ కోరుతోంది.





# స్టీల్, సిమెంట్, కంకర లేకుండా ఇళ్లు

విజయవాడ, ఏప్రిల్ 16, ఇల్లు నిర్మించాలంటే స్టీల్, సిమెంట్, కంకర, ఇసుక వంటివి అవసరం. కానీ ఇవేవీ లేకుండానే పాతకాలం నాటి పద్ధతులలో ఇల్లు నిర్మించారు ఆర్కిటెక్ట్ కరుణాకర్ రెడ్డి. మూడున్నర వ్యవధిలోనే పాత పద్ధతిలో మోడ్రన్ ఎకో ఫ్రెండ్లీ ఇల్లు నిర్మించారు. ఈ విధానంలో సహజ వనరుల వినియోగం 70 శాతం తగ్గుతుందని చెప్తున్నారు. ఇల్లు కట్టే స్థలంలోని మట్టిని ఉపయోగించి, ఇలాంటి పర్యావరణహిత ఇల్లు కట్టినట్లు తెలిపారు.ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అనేది పెద్దల సామెత. ఇళ్లు కట్టాలన్నా, పెళ్లి చేయాలన్నా బోలెడు తతంగం ఉంటుందనేది దాని ఉద్దేశం. పెళ్లి సంగతి పక్కనబెడితే.. ఇల్లు కట్టాలంటే మాత్రం చాలా కావాల్సి ఉంటుంది. మనం కోరుకున్న రీతిలో, మనకు నచ్చిన విధంగా, పర్యావరణహితంగా ఇల్లు కట్టడమంటే చిన్నపాటి యజ్ఞం చేసినట్టే. ఇక ఇల్లు కట్టాలంటే ఇసుక, సిమెంట్, కంకర, స్టీల్ వంటి నిర్మాణ సామాగ్రి, వాటికి అయ్యే ఖర్చు తడిసి మోపెడు అవుతుంటుంది. అయితే ఇవేవీ లేకుండానే పాతకాలం నాటి పద్ధతులు ఉపయోగించి అధునాతనమైన , అందమైన పర్యావరణహిత ఇల్లు కట్టొచ్చని చెప్తున్నారు కరుణాకర్ రెడ్డి అనే ఆర్కిటెక్ట్. ఈ విధానంలో ఆయన ఇల్లు నిర్మించారు.స్కాట్లాండ్‌లో తన చదువు పూర్తి చేసిన కరుణాకర్ రెడ్డి.. పర్యావరణ అనుకూల ఇళ్లను నిర్మించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. సంప్రదాయ పద్ధతిలో.. కంకర, సిమెంట్, స్టీల్, ఇసుక వంటివి ఏవీ అవసరం లేకుండానే అందమైన పర్యావరణహిత ఇళ్లను నిర్మించవచ్చని నిరూపిస్తున్నారు. ఇల్లు కట్టే స్థలంలోని మట్టికి డంగు కలిపి.. ఈ ఎకో ఫ్రెండ్లీ ఇల్లు నిర్మించారు కరుణాకర్ రెడ్డి. మరోవైపు పాతకాలంలో భవనాలు ఎలా నిర్మించేవారో అలాంటి విధానాన్ని ప్రస్తుత తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఇలా సంప్రదాయ పద్ధతిలో ఎకో ఫ్రెండ్లీ ఇళ్లు నిర్మిస్తున్నట్లు కరుణాకర్ రెడ్డి చెప్తున్నారు.సాధారణంగా ఇళ్లు కట్టే విధానంలో ప్లాస్టింగ్ చేస్తుంటారని.. దీని వలన వేడి ఉత్పత్తి కావటమే కాకుండా, కార్బన్ డై యాక్సైడ్ విడుదల అవుతుందని ఈయన చెప్తున్నారు. అలాగే ఇసుక, ఇటుక, కంకర వంటివి కావాల్సి వస్తుందని.. దీంతో వనరులు తగ్గిపోతున్నాయన్నారు. ఇలాంటివి పెద్దగా అవసరం లేకుండానే మనకు ఉన్న స్థలంలోని మట్టిని ఉపయోగించి, మన చుట్టూ ఉన్న వాటితోనే ఇల్లు కట్టినట్లు చెప్తున్నారు. పాతకాలం నాటి విధానాన్ని రీడిజైన్ చేసి మూడున్నర నెలలో ఇల్లు కట్టినట్లు తెలిపారు.మరోవైపు ఈ విధానంలో ఇల్లు కట్టాలంటే ముందుగా ఇల్లు కట్టే స్థలంలోని మట్టిని, నేల స్వభావాన్ని పరీక్షిస్తారు. ఆ తర్వాత ఆ ఇంటిని రాయితో కట్టాలా లేక పూర్తిగా మట్టిగోడలు సరిపోతాయా అనేది నిర్ణయిస్తారు. ఇంటిని కట్టే స్థలంలోని నేల స్వభావాన్ని అనుసరించి, రాతితో కట్టాలా, పూర్తిగా మట్టిగోడలు నిర్మించాలా, ఎంత ఎత్తులో గోడలు కట్టాలనే విషయాలను డిజైన్ చేసుకుంటామని కరుణాకర్ రెడ్డి చెప్తున్నారు. ఇంటి రూఫ్ నిర్మాణం విషయానికి వస్తే పాతకాలంలో మాదిరిగా దూలాలను ఏర్పాటు చేసి.. దానిపై డంగుతో కలిసి స్లాబ్ వేస్తామంటున్నారు. ఈ విధానంలో ఇల్లు కట్టడం ద్వారా సహజ వనరుల వినియోగాన్ని 70 శాతం వరకూ తగ్గించవచ్చంటున్నారు.ఈ విధానంలో సిమెంట్, ఇనుము బదులుగా సున్నం, మట్టి, కలప వంటి ప్రకృతి సిద్ధమైన పదార్థాలను ఉపయోగిస్తారు. దీంతో ఈ ఇల్లు వేసవిలో చల్లగా, శీతాకాలంలో వెచ్చగా ఉంటాయని.. మట్టి గోడలు సహజసిద్ధంగా వెంటిలేషన్ అందిస్తాయని అంటున్నారు.

# టీడీపీలో మూడోతరం

విజయవాడ, ఏప్రిల్ 16, తెలుగుదేశం పార్టీ లో నారా లోకేష్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ గా పట్టాభిషేకం చేయడం కేవలం ఒక పదవి మార్పు మాత్రమే కాదు, అది పార్టీ చరిత్రలో మరో తరానికి పార్టీ బాధ్యతలు అప్పగించే ఘట్టంగా కనిపిస్తోంది. 44 ఏళ్ల పార్టీ చరిత్రలో తొలిసారిగా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని సృష్టించి లోకేష్‌కు అప్పగించడం ద్వారా, చంద్రబాబు నాయుడు తన వారసుడికి పార్టీ పగ్గాలను అధికారికంగా బదిలీ చేసే దిశగా బలమైన అడుగు వేశారు. 75 ఏళ్ల వయసులో ఉన్న చంద్రబాబు, పాలనపై దృష్టి సారిస్తూనే పార్టీ సంస్థాగత బాధ్యతలను లోకేష్‌కు అప్పగించడం ఒక వ్యూహాత్మక ప్రయత్నంఈ సంస్థాగత మార్పుల్లో లోకేష్ ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా యువతకు, అట్టడుగు స్థాయి నేతలకు పెద్దపీట వేస్తూ రూపొందించిన కొత్త కమిటీలు పార్టీలో నూతనోత్సాహాన్ని నింపుతున్నాయి. కేవలం వారసత్వ రాజకీయాలకే పరిమితం కాకుండా, యువగళం పాదయాత్ర ద్వారా ప్రజల్లో సంపాదించుకున్న గుర్తింపు, ప్రస్తుతం ఐటీ మంత్రిగా చేస్తున్న అభివృద్ధి పనులు లోకేష్‌ను పార్టీలో తిరుగులేని నాయకుడిగా నిలబెట్టాయి. క్షేత్రస్థాయి కార్యకర్తలే నాయకులు అనే నినాదాన్ని నిజం చేస్తూ సామాన్య నేతలను కూడా పొలిట్‌బ్యూరోలోకి తీసుకోవడం లోకేష్ శైలికి నిదర్శనం.లోకేష్‌కు అత్యంత సన్నిహితులైన రాజేష్ కిలారు వంటి వారికి జాతీయ ప్రధాన కార్యదర్శులుగా కీలక బాధ్యతలు అప్పగించారు. లోకేష్ టీమ్ ఇప్పుడు పార్టీ యంత్రాంగాన్ని పూర్తిగా తమ నియంత్రణలోకి తీసుకున్నట్లు కనిపిస్తోంది. పాత తరం అనుభవాన్ని గౌరవిస్తూనే, తనకంటూ ఒక బలమైన కోర్ టీమ్ ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోవడానికి లోకేష్ సిద్ధమవుతున్నారు. ఇది పార్టీలో అంతర్గతంగా ఎటువంటి విబేధాలు రాకుండా సాఫీగా సాగుతున్న నాయకత్వ మార్పు. సామాజిక సమీకరణాల పరంగా కూడా ఈ మార్పులు అత్యంత వ్యూహాత్మకంగా ఉన్నాయి. 185 మందితో కూడిన రాష్ట్ర కమిటీలో 122 మంది వెనుకబడిన వర్గాలకు చెందిన వారికే ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా, టీడీపీ తన పాత సామాజిక పునాదులను మరింత పటిష్టం చేసుకుంటోంది. 40 శాతం బీసీలకు చోటు కల్పించడం ద్వారా బీసీల పార్టీ అనే ముద్రను తిరిగి చాటుకుంది. అలాగే మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా 50 మంది మహిళలకు కమిటీలో స్థానం కల్పించడం పార్టీ ఆధునిక దృక్పథాన్ని సూచిస్తోంది.ఈ మార్పులు 2029 ఎన్నికలే లక్ష్యంగా సాగుతున్నట్లు స్పష్టమవుతోంది. చంద్రబాబు మార్గదర్శకత్వంలో లోకేష్ ఇప్పుడు పార్టీకి ముఖ్య సేనాపతి గా మారారు. కేడర్ సంక్షేమం, డిజిటల్ నెట్‌వర్కింగ్, క్షేత్రస్థాయి బలోపేతంపై లోకేష్ చూపిస్తున్న ఆసక్తి టీడీపీని రాబోయే దశాబ్ద కాలం పాటు నడిపించేలా చేస్తోంది. ఈ పుత్రోదయం పార్టీకి కొత్త వెలుగునిస్తుందా లేదా అన్నది లోకేష్ భవిష్యత్తు వ్యూహాలపై ఆధారపడి ఉంటుంది.

# గిరిజన నియోజకవర్గాలపై దృష్టి

కాకినాడ, ఏప్రిల్ 16, ప్రతి రాజకీయ పార్టీ వ్యూహకర్తలను నియమించుకుంటోంది. కానీ జనసేనకు ఇంతవరకు వ్యూహకర్తలు లేరు. అయితే తాజాగా పార్టీ ఆ ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. జనసేన తరఫున ఓ బృందం ఉత్తరాంధ్రలో సర్వే చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో ఈ బృందం పర్యటించి వివరాలు సేకరిస్తోంది. అయితే ఈ సర్వే బృందం ఐపాక్ అని ప్రచారం నడుస్తోంది. ఇప్పటికే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఐప్యాక్ సేవలందిస్తోంది. ప్రస్తుతం జనసేన తరుపున సేవలందిస్తున్న వారు పక్క రాష్ట్రాలకు చెందిన వారుగా తెలుస్తోంది. ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో జనసేన పరిస్థితి ఏంటి? అక్కడ ఏ పార్టీకి బలం ఉంది? జనసేన గ్రాఫ్ పెరిగిందా? అన్న వివరాలను ఆ సర్వే బృందం తెలుసుకుంటున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా విశాఖ జిల్లాలో జనసేన తరఫున ఈ సర్వే జరుగుతున్నట్లు తెలుస్తోంది.ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రూటు మార్చారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలతో పాటు గిరిజన ప్రాంతాలపై ఫోకస్ పెట్టారు. గిరిజన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే మొదట్లో అంతా అంచనా వేయలేకపోయారు కానీ.. పక్కా రాజకీయ వ్యూహంతోనే పవన్ కళ్యాణ్ ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టినట్లు అర్థమవుతుంది. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచేవారు గిరిజనులు. ఆ తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు టర్న్ అయ్యారు. అయితే ఆ ఓటు బ్యాంకు తెలుగుదేశం ఎంత ప్రయత్నించినా వర్కౌట్ కాదు. అందుకే ఆ బాధ్యతలను పవన్ కళ్యాణ్ తీసుకున్నట్టు కనిపించారు. అందుకే తరచూ గిరిజన ప్రాంతాల్లో పర్యటించి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు. కొండ శిఖర గ్రామాలకు సైతం రహదారులు నిర్మించారు. వారికి ప్రత్యేకంగా సొంత నిధులతో చాలా రకాల వసతులు కూడా సమకూర్చారు. అటు గిరిజనులు కూడా పవన్ కళ్యాణ్ విషయంలో ప్రత్యేక ప్రేమ చూపుతూ వచ్చారు.ఏపీలో ఆరు ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఒక పార్లమెంట్ స్థానం ఎస్టిలకు రిజర్వు అయింది. పునర్విభజనతో ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు పెరగనున్నాయి. మరోవైపు వచ్చే ఎన్నికల్లో సీట్లు ఎక్కువగా తీసుకోవాలని జనసేన భావిస్తోంది. తెలుగుదేశం పార్టీకి ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలపై పెద్దగా అంచనాలు లేవు. అందుకే అక్కడ పవన్ కళ్యాణ్ ను ప్రయోగిస్తున్నట్లు అర్థమవుతోంది. ఆయన సైతం తన వద్ద ఉన్న అటవీశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలతో గణనీయంగా అభివృద్ధి చేసి చూపిస్తున్నారు.. గిరిజనులతో మమేకం అవుతున్నారు. అందుకే అక్కడ జనసేన గ్రాఫ్ ఎలా ఉందో తెలుసుకునేందుకు సర్వే సంస్థలను రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. అయితే అవసరం అనుకుంటే ఐ ప్యాక్ టీమును పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జనసేన భావిస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. అయితే గతంలో వైసిపికి పనిచేసిన వారు కాకుండా కొత్తవారిని నియమించుకునే అవకాశం కనిపిస్తోంది

# ఆటలో 20 కోట్లు ...

తిరుపతి, ఏప్రిల్ 16, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన వైఫల్యాలు, అవినీతిని బయటపెడుతోంది కూటమి ప్రభుత్వం. ఇప్పటివరకు మద్యం కుంభకోణం రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఇప్పుడు మరో కుంభకోణం పై ఫుల్ క్లారిటీ వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భారీ అవినీతి జరిగిందని దర్యాప్తు లో తేలింది. రాష్ట్ర ప్రభుత్వానికి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ కీలక నివేదిక ఇచ్చింది. అప్పట్లో క్రీడల శాఖ మంత్రిగా ఆర్కే రోజా ఉండేవారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ శాప్ చైర్మన్ గా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఉండేవారు. ఇప్పుడు వారిద్దరి చుట్టూ ఉచ్చు బిగిస్తున్నట్టు తెలుస్తోంది. తప్పకుండా అరెస్టు ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. విజిలెన్స్ దర్యాప్తు పూర్తయింది. నివేదిక ప్రభుత్వానికి అందడంతో సీరియస్గా నిర్ణయాలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఆడుదాం ఆంధ్ర పేరిట క్రీడా పోటీలు నిర్వహించారు. కానీ అప్పట్లో సుదీర్ఘకాలం కొనసాగాయి క్రీడా పోటీలు. క్రీడా పరికరాల కొనుగోలుతో పాటు నిర్వహణలోనూ అడుగడుగునా అవినీతి జరిగిందన్నది అప్పట్లోనే ఆరోపణలు వినిపించాయి. దీనిపై కూటమి అధికారంలోకి రాగానే విచారణ ప్రారంభం అయింది. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. గత కొద్దిరోజులుగా ఉమ్మడి 13 జిల్లాల పరిధిలో దర్యాప్తు కొనసాగింది. అయితే చివరిగా రూ.20.37 కోట్లు దోచుకున్నారని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ నిగ్గు తేల్చింది. అయితే ఇందులో ఆర్కే రోజా తో పాటు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పాత్ర ఉన్నట్లు తేలింది. దీంతో వారి అరెస్ట తప్పదన్న ప్రచారం మొదలైంది.ఏదైనా కాంట్రాక్టు అప్పగించే ముందు అనుభవం, అర్హతలు పరిశీలిస్తారు. కానీ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణ కాంట్రాక్టును తగిన అనుభవం, అర్హతలు లేని తమ కుటుంబ సన్నిహితుడికి కట్టబెట్టారు మంత్రి ఆర్కే రోజా. అప్పటి శాప్ చైర్మన్ హోదాలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తన ప్రధాన అనుచరుడిని ముందు పెట్టి అక్రమాలకు పాల్పడ్డారని దర్యాప్తు సంస్థ నిర్ధారించింది. అప్పట్లో ఆడుదాం ఆంధ్రకు సోషల్ మీడియాలో ప్రచారం పేరిట కూడా వైసిపి ఇన్ఫ్లుయెన్సర్లకు భారీగా నగదు మొట్ట చెప్పినట్లు తేలింది. బ్రాండింగ్, వీడియో, ఫోటోగ్రఫీ ల పేరుతో భారీగా నిధులు దుర్వినియోగం చేశారని స్పష్టం చేసింది.. నాసిరకమైన క్రీడా పరికరాలతో కోట్లాది రూపాయలు కొల్లగొట్టారని గుర్తించింది. మంత్రి రోజా, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, అతని ప్రధాన అనుచరుడైన శాప్ ఐటీ కన్సల్టెంట్ జీకే కిషోర్ బాబు పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కేసును ఏసీబీ లేదా సిఐడి కి అప్పగించాలని విజిలెన్స్ అండ్ అన్ఫోర్స్మెంట్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.ఆడుదాం ఆంధ్రాలో రోజాతో పాటు సిద్ధార్థ రెడ్డి అవినీతి చేశారని స్పష్టంగా తెలిసిపోయింది. ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలతో ఐప్యాక్ సభ్యురాలికి ప్రచార ఖర్చుల నిమిత్తం భారీగా కేటాయించినట్లు గుర్తించింది దర్యాప్తు సంస్థ. ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయం ప్రమేయంతోనే కేటాయింపులు చేసినట్లు గుర్తించడం విశేషం. ఈ మొత్తం వ్యవహారంలో రోజాతో పాటు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి టార్గెట్ కానున్నారు అన్నమాట.

# నాగాయలంక లో రోడ్డు ప్రమాదం

## ట్రాక్టర్ బోల్తాపడి పదిమందికి గాయాలు

అవనిగడ్డ,నాగాయలంక సాయిబాబా గుడి వద్ద కూలీల ట్రాక్టర్ బోల్తాపడి పదిమందికి గాయాలు అయ్యాయి. ప్రమాద బాధితులను స్థానికులు అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముగ్గురు పరిస్థితి విషమం గా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం మచిలీపట్నం రిఫర్ చేసారు. ప్రమాద బాధితులందరూ నాగాయలంక మండలం గణపేశ్వరం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు.

## జనగణన శిక్షణకు కమిషనర్ శేషన్న సందర్శన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 16-:నంద్యాల పట్టణంలోని ఎస్బీఐ కాలనీలో ఉన్న రామకృష్ణ పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న 2027 జనగణన రెండవ విడత శిక్షణ తరగతులను మున్సిపల్ కమిషనర్ బి శేషన్న, చార్జ్ ఆఫీసర్ పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతుల నిర్వహణ, సిబ్బంది హాజరు, శిక్షణ విధానాన్ని సమీక్షించారు.జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని, ప్రతి సిబ్బంది బాధ్యతతో పనిచేసి ఖచ్చితమైన సమాచారం సేకరించాలని కమిషనర్ శేషన్న సూచించారు. శిక్షణలో అందిస్తున్న మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని, ఎలాంటి పొరపాట్లు లేకుండా గణన నిర్వహించాలని తెలిపారు.ఇంటి ఇంటికీ వెళ్లి ప్రజల నుంచి సరైన వివరాలు సేకరించడం ద్వారా మాత్రమే జనగణన విజయవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం సూచించిన విధానాలను కచ్చితంగా పాటిస్తూ సమయపాలనతో పని చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, శిక్షణ నిర్వాహకులు, గణన సిబ్బంది పాల్గొన్నారు.

## మద్దులేటి స్వామి వార్షికోత్సవాలకు శ్రీకారం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 16-: శ్రీ ఘణ మద్దులేటి లక్ష్మీ నృసింహా స్వామి దేవస్థానం, తెలుగు పేటలో జరగనున్న ఆలయ అష్టవింశతి (28వ) వార్షికోత్సవ మహోత్సవాలకు ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ మహోత్సవాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా నిర్వహించాలనే సంకల్పంతో తొలి ఆహ్వాన పత్రికను రంగాపురం లో వెలసిన స్వయంభూ శ్రీ లక్ష్మీ మద్దులేటి స్వామి వారి సన్నిధిలో సమర్పించారు.ఈ సందర్భంగా స్వామి, అమ్మవారి ఆశీస్సులు తీసుకుని, అనంతరం ఆలయ అర్చకులకు ఆహ్వాన పత్రికను అందజేశారు. భక్తుల సమక్షంలో భక్తి శ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.రాబోయే వార్షికోత్సవ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కృప పొందాలని కోరారు.


## నంద్యాల రైల్వే స్టేషన్‌లో ఉద్యోగి ఆత్మహత్య--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 16:నంద్యాల రైల్వే స్టేషన్‌లో గురువారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. రైల్వే ఎలక్ట్రికల్ విభాగంలో పనిచేస్తున్న జైపాల్ అనే ఉద్యోగి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.నంద్యాల రైల్వే కాలనీలో నివాసముంటున్న జైపాల్ గత 20 నుంచి 25 సంవత్సరాలుగా రైల్వే శాఖలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కుటుంబ కలహాలు లేదా వ్యక్తిగత సమస్యల కారణంగానే ఈ దారుణానికి పాల్పడ్డాడా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ఈ సంఘటనతో రైల్వే సిబ్బంది, స్థానికులు విషాదంలో మునిగిపోయారు.

## పర్యాటక అభివృద్ధికి నిధుల వినియోగం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 16:- జిల్లాలో ప్రకృతి పర్యాటక అభివృద్ధికి సంస్థల సామాజిక బాధ్యత నిధులను వినియోగించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో అటవీ శాఖ అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, జిల్లా ఎస్పీ సునీల్ షెరాణ్ తదితరులు పాల్గొన్నారు.ప్రకృతి పర్యాటకం అభివృద్ధి వల్ల పర్యాటకుల రాక పెరుగుతుందని పేర్కొన్న కలెక్టర్, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అటవీ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుని ఆక్రమణలపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. వెదురు ప్రాజెక్ట్ అమలుకు ఉద్యాన శాఖతో సమన్వయం చేయాలని తెలిపారు. అటవీ తనిఖీ కేంద్రాలను పోలీసు నియంత్రణ



గదితో అనుసంధానం చేసి భద్రత పెంచాలని, రిజర్వ్ అటవీ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. శ్రీశైలం ప్రాంతంలో రహదారి, వాహన నిలుపుదల సదుపాయాల విస్తరణపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.

## కలెక్టర్ తనిఖీలు డీఎంహెచ్ఓ సెలవుల్లో--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 16-జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. మండల స్థాయి ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన వెంటనే జిల్లా వైద్యాధికారి



(డీఎంహెచ్ఓ) 15 రోజుల సెలవు తీసుకోవడం వివాదాస్పదంగా మారింది. ఈ చర్యపై ఉద్యోగులు, ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ నిర్వహించిన తనిఖీల సమయంలో పలు అవకతవకలు, అక్రమాలపై ఆరోపణలు వినిపించినట్టు సమాచారం. రికార్డుల నిర్వహణలో లోపాలు, సేవల అమలులో నిర్లక్ష్యం, బయటపడినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విచారణ మరింత విస్తరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఇలాంటి సమయంలోనే డీఎంహెచ్ఓ అకస్మాత్తుగా 15 రోజుల సెలవు పెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. అవినీతి వ్యవహారాలు ఎక్కడ బయటపడతాయోననే భయంతోనే సెలవు తీసుకున్నారనే విమర్శలు ఉద్యోగులు, ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. శాఖలో నెలకొన్న పరిస్థితులపై నిజానిజాలు వెలుగులోకి రావాలని వారు కోరుతున్నారు.మరోవైపు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కొంతకాలంగా అక్రమాలు, లంచాల ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ పని జరగాలన్నా డబ్బులు తప్పనిసరి అన్న భావన నెలకొన్నదని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో కలెక్టర్ తనిఖీలు మరింత కీలకంగా మారాయి.ప్రస్తుతం డీఎంహెచ్ఓ సెలవు వ్యవహారం, కలెక్టర్ తనిఖీలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## జలధారలో ప్రజల భాగస్వామ్యం కీలకం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , ఏప్రిల్ 16:-జిల్లాలో అమలవుతున్న జలధార జలహారతి కార్యక్రమంలో ప్రజలు విస్తృతంగా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ జి



రాజకుమారి పిలుపునిచ్చారు. గురువారం డోన్ మండలం ఉంగరానిగుండ్ల గ్రామంలోని ఎద్దుపెంట వాటర్ షెడ్ ప్రాజెక్టును ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. రిడ్జ్ టు వ్యాలీ విధానంలో వర్షపు నీటిని నిల్వ చేసి భూమిలోకి ఇంకించే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే పర్కొలేషన్ ట్యాంకులు, చెక్ డ్యామ్‌లు, రాక్ ఫిల్ డ్యామ్‌లు నిర్మించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచినట్లు పేర్కొన్నారు.ఎద్దుపెంట ప్రాంతంలోని సహజ వాగులను శుభ్రపరిచి నీటి ప్రవాహాన్ని మెరుగుపరచాలని అధికారులకు ఆదేశించారు. కొత్త పర్కొలేషన్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైన పనులకు త్వరలోనే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు.ఉద్యానవన పంటలను ప్రోత్సహిస్తూ డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లు వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఏడు గ్రామాలకు ఉపయోగపడే నీటి నిల్వ ప్రాజెక్టుకు ఆమోదం తెలుపుతూ పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు.

## మంత్రాలయం మండలం చిలకలడోణ వద్ద రోడ్డు ప్రమాదం.

**- 8 మంది మృతి,12 మందికి గాయాలు.**

**- క్షతగాత్రులను పరామర్శించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.**

విభారే న్యూస్ ఏప్రిల్ 16 కర్నూలు జిల్లా ప్రతినిధి..కర్నూలు జిల్లా, మంత్రాలయం మండలం, చిలకల డోణ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఎమ్మిగనూరులో ప్రాథమిక చికిత్స అనంతరం క్షతగాత్రులను కర్నూలుకు పంపించారు.ఈ సందర్భంగా



గురువారం ఉదయం కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.ఎస్పీ మీడియాతో మాట్లాడారు.ప్రస్తుతం 12 మంది కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తెల్లవారుజామున బొలెరో వాహన డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడంతో డివైడర్ దాటి అవతలి రోడ్డు పై కి వెళ్లి అశోక లై ల్యాండ్ వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు వెల్లడించారు.మంత్రాలయం దర్శనార్థం బొలెరో వాహనంలో కర్ణాటకకు చెందిన 20 మంది భక్తులు ప్రయాణం చేస్తుండగా,ఈ ప్రమాదంలో 8 మంది మృతి చెందినట్లు తెలిపారు.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోందని ఎస్పీ పేర్కొన్నారు.ప్రజలు వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.డ్రైవర్లు నిద్ర మత్తులో వాహనం నడపకూడదన్నారు. నిద్ర వస్తే ప్రక్కకు వాహనం ఆపి విశ్రాంతి తీసుకోవాలన్నారు. కర్నూలు ఎస్పీతో పాటు సిఐలు మధుసుధన్ రావు, శివశంకర్, శేషయ్య ఉన్నారు.

## జిల్లా అభివృద్ధికి 10 సూత్రాల పురోగతి అత్యంత కీలకం

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, ఏప్రిల్ 16:- రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ 2047 లో భాగంగా రూపొందించిన 10 సూత్రాలు జిల్లా అభివృద్ధికి అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జీరో పావర్టీ, మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, నైపుణ్యం,ఉపాధి కల్పన, ఫార్మర్ అగ్రిటెక్ , స్వచ్ఛాంధ్ర తదితర 10 సూత్రాల అమలు పురోగతి పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ 2047 లో భాగంగా 10 సూత్రాలను రూపొందించారని, ఈ 10 సూత్రాలు చాలా ముఖ్యమైనవి అన్నారు. ప్రస్తుతం చేపట్టిన నీటి భద్రత జలధార-జలహారతి కార్యక్రమంలో భాగంగా పాత నీటి వనరులన్నింటినీ పునరుద్ధరిస్తున్నాం అన్నారు. ప్రతి చుక్కను భూగర్భంలోకి పంపడమే మన లక్ష్యం అన్నారు. దీనివల్ల అగ్రికల్చర్, హార్టికల్చర్ పంటలకు నీటి భద్రత లభిస్తుందన్నారు. అంతేకాకుండా, నీటి లభ్యత పెరగడం వల్ల విద్యుత్ వినియోగం కూడా తగ్గుతుందన్నారు. ప్రజలకు ఉపాధి కల్పించి తలసరి ఆదాయాన్ని పెంచినా, అది 'జీరో పావర్టీ' కు దారితీస్తుందన్నారు. 'జీరో పావర్టీ'లో సెర్ప్ ద్వారా 'వే సైడ్ అమినిటీస్' ఏర్పాటు కు సంబంధించి ఎస్.హెచ్.జి గ్రూపులతో మాట్లాడి, ఎవరికి ఆసక్తి ఉందో కనుక్కొని ప్రతిపాదనలు పంపాలన్నారు. ఇందులో భాగంగా వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి, లోన్లు ఇప్పించి వారిని ప్రోత్సహించాలన్నారు. పాపులేషన్ మేనేజ్మెంట్ కు సంబంధించి ఫ్యామిలీ ప్లానింగ్ టార్గెట్లు చేయకపోతే అంతిమంగా పెంచాలన్నారు. టీనేజ్ ప్రెగ్నెన్సీ లను తగ్గించడానికి రూపొందించిన యాక్షన్ ప్రణాళిక ను తీసుకొని రావాలని కలెక్టర్ డి ఎమ్ హెచ్ ఓ కార్యాలయం వారిని ఆదేశించారు. వ్యవసాయం మరియు అగ్రిటెక్ కి సంబంధించి వర్షపాతం తక్కువగా ఉన్నందున, వాతావరణ పరిస్థితులకు తగిన పంటలను ఎంచుకోవాలనే విషయాలను రైతులకు తెలియచేయాలన్నారు. దిగుబడి పెంచడానికి మిశ్రమ పంటలు మరియు అంతర పంటలు వేసుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛాంధ్ర కు సంబంధించి కేవలం అవేర్నెస్ క్యాంపులు, గ్రామ సభలే కాకుండా, గ్రామాల్లో ప్రధాన, మధ్యస్థ, చిన్న కాలువలు ఎన్ని ఉన్నాయి వాటిని తరచుగా శుభ్రం చేస్తున్నారా? లేదా? ఘన వ్యర్థాలు, ద్రవ వ్యర్థాలు ఎంత వస్తున్నాయి, వాటిని ఏ విధంగా ట్రీట్ చేస్తున్నారు అని దృష్టి పెట్టాలని కలెక్టర్ డి పి ఓ ను ఆదేశించారు. స్వచ్ఛ రథాలు ప్రతి నెల మండలంలోని న అన్ని గ్రామాలను కవర్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 16:- జిల్లా ఎస్పీ సునీల్ శరన్ ఆదేశాల మేరకు నంద్యాల మండలం చాబోలు గ్రామంలో మహిళల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్ సిఐ జయరాం గ్రామ సచివాలయంలో మహిళలకు చట్టాలు, భద్రతా చర్యలపై వివరించారు.శక్తి టీమ్స్, శక్తి యాప్ వినియోగం, అత్యవసర సమయంలో 112, సైబర్ నేరాల కోసం 1930 హెల్ప్‌లైన్ ఉపయోగించుకోవాలని సూచించారు. అపరిచిత కాల్స్‌కి స్పందించవద్దని, పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు పర్యవేక్షణ అవసరమని తెలిపారు.అలాగే, అవసరమైతే సఖీ వన్ స్టాప్ సెంటర్ల సేవలను వినియోగించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరి-- ? రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 16:నంద్యాల మండలం చాపిరేవుల సమీపంలోని హైవే రోడ్డుపై ఈరోజు మధ్యాహ్నం ట్రాఫిక్ సీఐ చాన్ బాష ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాహనదారులకు హెల్మెట్ ధరించడం ఎంత ముఖ్యమో వివరించారు.ట్రాఫిక్ సీఐ చాన్ బాష మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ప్రాణాపాయానికి దారితీస్తుందని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అధిక వేగంతో వాహనాలు నడపడం, మైనర్లు వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు కారణమవుతాయని హెచ్చరించారు.ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని, రోడ్లపై జాగ్రత్తగా ప్రయాణించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ద్విచక్ర వాహనదారులు సూచనలు పాటిస్తామని తెలిపారు.

## బైరెడ్డి శబరికి జాతీయ పదవి-- నంద్యాలలో సంబరాలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 16:- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎంపిక కావడంతో నంద్యాల పట్టణం నాలుగో వార్డులో సంబరాలు ఘనంగా నిర్వహించారు. టిడిపి మహిళా నాయకురాలు షేక్ వాహిదా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ డి. రంగప్రసాద్, నాయకులు వి. సంజీవరెడ్డి, అచ్చు, ఉస్మాన్ బాషా, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు. ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన శబరి పిఎ రాజేష్ నాయుడు మృతికి ఒక నిమిషం సంతాపం తెలిపారు.ఈ సందర్భంగా నారా లోకేష్ టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, బైరెడ్డి శబరిని జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ఈ పదవులు దోహదపడతాయని అన్నారు.అలాగే 15 సూత్రాల కమిటీ సభ్యునిగా ఎంపికైన ఉస్మాన్ బాషాను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**